తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శనివారం | 1 ఆగస్టు 2026

పేజీలు : 08

# బాలయ్య గల్లంతు ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యమే

- ప్రేమ్‌నగర్ నాలా వద్ద భద్రతా చర్యల లేమిపై బీఆర్ఎస్ నేత బొబ్బ నవతారెడ్డి ఆగ్రహం
- ప్రతి వర్షాకాలంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాలకులు
- మ్యాన్‌హోళ్లు, ప్రమాదకర నాలాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్



**శేరిలింగంపల్లి, జూలై 31 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ రైల్వే అండర్‌పాస్ సమీపంలో ప్రమాదకర నాలాలో పడి గల్లంతైన వృద్ధుడు బాలయ్య (70) ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చందానగర్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు బొబ్బ నవతారెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగానే అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు.

ప్రతి వర్షాకాలంలో నియోజకవర్గ ప్రజలు ప్రాణభయంతో జీవించాల్సిన పరిస్థితి నెలకొందని, మ్యాన్‌హోళ్లు, తెరిచి ఉన్న నాలాల వద్ద కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని అన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం, అధికారులు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని మండిపడ్డారు.

ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, వర్షాకాలంలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రతను గాలికొదిలేయడం వల్లే ఇటువంటి విషాద ఘటనలు పునరావృతమవుతున్నాయని విమర్శించారు. బాలయ్య ఆచూకీ కోసం సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాల కంటే పరిపాలనా నిర్లక్ష్యానికి ప్రాధాన్యం ఇస్తే ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అల్లావుద్దీన్ పటేల్, మిద్దల మల్లారెడ్డి, పొట్ట నరేందర్ యాదవ్, విజయ్‌కుమార్ రెడ్డి, సంగారెడ్డి, జనార్దన్, ఎం.డి. సలీం, శ్రీనివాస్ రెడ్డి, రాములు, చారి, చందర్‌రావు, శభాన, అంజి యాదవ్, అనంతరెడ్డి, రాజశేఖర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.
- ఎనిమిది వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలలి.
- రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్ డిమాండ్.

**తాండూరు జులై 31(జనంసాక్షి) :** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తాండూర్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండూర్ ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించి అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్ మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వాలు విద్యార్థుల ఫీజు రీఎంబర్స్మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కళాశాలలు ఫీజులు చెల్లించలేదనే పేరుతో పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం, హాస్టళ్ల నుంచి బయటకు పంపించడం వంటి అమానుష ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయినప్పటికీ, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆ హక్కు కాలరాయబడుతోందని, మహానేత ఆర్. కృష్ణయ్య పోరాట ఫలితంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని అనంతరం వచ్చిన ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, ఎన్నికల హామీలను విస్మరించి యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ప్రస్తుతం రూ.8,000 కోట్లకు పైగా ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి కళాశాలలకు చెల్లించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకుర్, బీసీ సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్ చారి, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, బషీరాబాద్ మండల్ మహిళా అధ్యక్షురాలు వీరమని, మీడియా ఇంచార్జ్ బసవరాజ్, బీసీ సంగం నాయకులు జోసఫ్, రాజు గౌడ్, పరమేష్, తాంద్ర నరేష్, మంతటి రాజు, గొట్లపల్లి రామ్, కిరణ్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# పేదల భూములను స్వాధీనం చేసుకోవద్దు

- హన్మగల్-హయత్‌నగర్ సర్వే నంబర్ 255/1 భూములను పరిశీలించిన నాయకులు
- రైతులు, ప్లాట్ల యజమానులకు పూర్తి భరోసా కల్పించాలని బీజేపీ డిమాండ్
- ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

8

# ఉప్పల్‌కు ఇక ట్రాఫిక్ తిప్పలు తీరనున్నాయా?

- ఎలివేటెడ్ కారిడార్ పనులు కీలక దశకు.. రింగ్‌రోడ్డు ప్రారంభంపై ప్రజల్లో ఆసక్తి
- పిల్లర్ నిర్మాణం పూర్తయిందనే ప్రచారం.. అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు
- పూర్తయితే తూర్పు హైదరాబాద్ రవాణా వ్యవస్థకు భారీ ఊరట



8

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్
- మోమిన్‌పేటలో ఎంఐఎం నాయకులతో సమీక్ష



**మోమిన్‌పేట, జూలై 31 (జనంసాక్షి):** ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా కృషి చేయాలని బహదూర్‌పుర ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మోమిన్‌పేట మండల కేంద్రంలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మండల ఎంఐఎం అధ్యక్షుడు మేరాజ్‌ను ప్రక్రియ ప్రస్తుత స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎస్ఐఆర్ నమోదు గడువు సమీపిస్తున్నందున ఇంకా నమోదు చేసుకోని ఓటర్లను గుర్తించి, వారి పేర్లు నమోదు చేయించే బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఐఎం అధ్యక్షుడు మేరాజ్, నాయకులు ఇనాయత్, బాబా, అయాజ్, షానవాజ్, మొయిన్, జావీద్, ఖాజా పాల్గొన్నారు.

# చిన్నారి ప్రాణం కోసం చేయూత ఇవ్వండి..!

### కాలేయ వ్యాధితో ఐదు నెలల పసిబిడ్డ మృత్యువుతో పోరాటం

### రూ.30 లక్షల చికిత్సకు దాతల సహకారం కోసం తల్లిదండ్రుల వేడుకోలు



**సదాశివనగర్, జూలై 31 (జనంసాక్షి):** అమ్మ ఒడిలో బోసినవ్వులు చిందిస్తూ ఇంటిల్లిపాదిని ఆనందింపజేయాల్సిన ఐదు నెలల పసిబిడ్డ ఇప్పుడు ప్రాణాల కోసం పోరాడుతున్నాడు. కాలేయానికి సంబంధించిన అరుదైన తీవ్ర వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారి ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే చికిత్సకు అవసరమైన భారీ వ్యయం ఆ నిరుపేద కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది.

గాంధారి మండల కేంద్రానికి చెందిన కర్కంపల్లి రవికుమార్--సంధ్య దంపతుల ఐదు నెలల కుమారుడికి అత్యవసరంగా ప్రత్యేక వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. చికిత్స కోసం సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తమ స్థోమతకు మించి వైద్య ఖర్చులు భరించిన తల్లిదండ్రులు, ఇకపై అవసరమైన మొత్తాన్ని సమకూర్చలేని పరిస్థితిలో దాతల సహాయాన్ని కోరుతున్నారు. "మా బిడ్డను కాపాడండి... మీరు చేసే చిన్న సహాయం కూడా మా కుమారుడికి కొత్త జీవితాన్ని అందించవచ్చు" అంటూ వారు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు. దాతృత్వం ఉన్న ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయం చేసి, ఈ విషయాన్ని మరింత మందికి చేరవేసి పసిబిడ్డ ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో భాగస్వాములు కావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయదలిచిన వారు : ఫోన్‌పే / గూగుల్ పే: 8367006456 (కర్కంపల్లి రవికుమార్)

## హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రేమ్‌చంద్ మైథిలీ శరణ్ గుప్త్ జయంతి వేడుకలు



**హయత్‌నగర్, జూలై 31(జనం సాక్షి) :** హయత్‌నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ హిందీ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్, రాష్ట్రకవి మైథిలీ శరణ్ గుప్త్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ రచనలు సామాజిక చైతన్యానికి దోహదపడినవని, నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమని అన్నారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ అపర్ణా చతుర్వేది ప్రేమ్‌చంద్ కథలు, నవలల విశిష్టతను వివరించడంతో పాటు, మైథిలీ శరణ్ గుప్త్ జాతీయ భావాలను ప్రతిబింబించే కవిత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు. విద్యార్థులు ఇద్దరు మహనీయుల జీవితం, సాహిత్య సేవలపై తమ అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు ప్రేమ్‌చంద్ కథలపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ నర్సయ్య, ఫిజికల్ డైరెక్టర్ డా. కె. అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బంట్వారం మండలంలో బస్వాపూర్ గ్రామసభ నిర్వహణ



**బంట్వారం జూలై 31 జనంసాక్షి :** బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామంలో సర్పంచ్ స్రవంతి శివరాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రెవెన్యూ, ఆరోగ్య, విబీజీ, సెర్ప్ అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రజలకు ఉన్న సమస్యలపై చర్చించి, సంబంధిత శాఖల అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అయోధ్యనగర్ ఆలయ భూమి కబ్జా

### ఆలయ భూములను కూడ వదలని కబ్జాదారులు

### తక్షణ చర్యలకు బీజేపీ డిమాండ్




**బోడుప్పల్-జనంసాక్షి**

మేడిపల్లి పరిధిలోని అయోధ్యనగర్‌లో ఆలయ భూములు,ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు అక్రమ కబ్జాలకు గురవుతున్నాయని పీర్జాదిగూడ బీజేపీ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్ రెడ్డి,సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు.దీనిపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా జమ్ముల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అయోధ్యనగర్‌లోని సర్వే నంబర్లు 50,51,52,53,54 పరిధిలో సుమారు 500 గజాల భూమిని శ్రీ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం దేవాదాయ భూమిగా కేటాయించినట్లు తెలిపారు.అయితే కొంతమంది భూ కబ్జాదారులు ఆ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.రికార్డుల ప్రకారం ఆలయ భూమిగా ఉన్న స్థలాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తూ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే కాలనీ అభివృద్ధి,పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించిన ఖాళీ స్థలాలు, పార్కులు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు, చిన్నారులు వినియోగించాల్సిన పార్కులు అన్యాక్రాంతం కావడం బాధాకరమని అన్నారు.అధికారులు వెంటనే సంబంధిత భూములను సర్వే చేసి ఆక్రమణదారులను గుర్తించాలని,అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.ఆలయ భూమిని దేవాదాయ శాఖ లేదా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టి భవిష్యత్తులో కబ్జాలకు అవకాశం లేకుండా చూడాలని కోరారు.అలాగే పార్కులు,ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అయోధ్యనగర్ ప్రజల మనోభావాలకు అనుగుణంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం నిర్విఘ్నంగా జరిగేలా ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించాలని జమ్ముల ప్రభాకర్ రెడ్డి కోరారు.





# పాలకులు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

### విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిద్దాం

### ఏఐఎస్ఎఫ్ సభ్యత్వాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**బోడుప్పల్ (జనంసాక్షి) :** ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ నారాయణ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు సభ్యత్వాలు అందించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... నాణ్యమైన విద్య, విద్యార్థుల హక్కుల పరిరక్షణ మరియు సమస్యల పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని, పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా కాలయాపన చేస్తున్నారు. పేద వాడికి నాణ్యమైన ఉచిత విద్య అందకుండా కుట్రలు చేస్తున్నారు.విద్యారంగంలో ఎదురవుతున్న సవాళ్లపై పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శి ఎండి, అన్వర్ , ఉపాధ్యక్షుడు హరీష్ , కృష్ణ , భరత్ , అరవింద్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కన్వీనర్ బుడగ జంగం వెంకటేష్



**తాండూరు జూలై 31 (జనంసాక్షి)** నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కన్వీనర్ బుడగ జంగం వెంకటేష్ డిమాండ్ చేశారు. అన్నం పెట్టే రైతన్నను మోసం చేసి నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల యాలాల మండలం హాజీపూర్ గ్రామంలో నకిలీ ఎరువులు అమ్ముతూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు మునుముందు జరగకుండా అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. తాండూరు ప్రాంతంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలు వాడవాడలో వెలిశాయన్నారు. అన్నం పెట్టే రైతన్నకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తే పంట సాగుతో దిగుబడులు అందరికి అన్నం పెట్టే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. కొందరు వ్యాపారులు తమ లాభాల కోసం నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు అమ్ముతున్న వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కట్టిన చర్యలు తీసుకోవాలని బుడగ జంగం వెంకటేష్ డిమాండ్ చేశారు. అదే విదంగా కొందరు వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. వాటిపై కూడా వ్యవసాయ ఉన్నతధికారులతో తనిఖీలు చేయించి బాద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాజేంద్రనగర్ నూతన ఇన్‌స్పెక్టర్‌కు బీజేపీ నేతల సన్మానం



**రాజేంద్రనగర్, జూలై31(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ నూతనంగా నియమితులైన ఆర్. వెంకటేశ్‌ను బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి సాబాద విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకులారం కృష్ణ కిట్టు, అత్తాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు స్టార్ చిన్న శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## ఆర్‌జీఐ ట్రాఫిక్ ఎస్ఐ నూరుద్దీన్‌కు పదవీ విరమణ వీడ్కోలు



**శంషాబాద్,జూలై31(జనంసాక్షి) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా సేవలందించిన మహమ్మద్ నూరుద్దీన్ శుక్రవారం పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మహమ్మద్ నూరుద్దీన్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన పోలీస్ శాఖలో చూపిన క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిర్వహణ పట్ల అంకితభావాన్ని కొనియాడారు. సేవా కాలమంతా ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించడంలో మహమ్మద్ నూరుద్దీన్ విశేష కృషి చేశారని అధికారులు, సహచర సిబ్బంది పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ అందరూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనుమానాస్పద కదలిక వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

### కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి
### మీ సురక్షపై కాలనీ వాసులకు అవగాహన




**కాప్రా, జులై 31 (జనం సాక్షి) :** కాలనీలో అనుమానాస్పద కదలిక వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల రక్షణే మా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నామని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి అన్నారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లో గురువారం రాత్రి మీ సురక్ష కార్యక్రమం లో భాగంగా సైబర్ నేరాల నివారణ, మహిళలు అనుమానస్పద వ్యక్తుల పై జాగ్రత్త లు తదితర అంశాలపై శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ అధ్యక్షతన కాలనీలో అవగాహన కార్యక్రమం నునిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులు గా కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లలో పని చేసే పనిమనుషులు, ఇండ్లలో ఉండే రెంటర్స్ ల పూర్తి సమాచారం ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, తీసుకొని జాగ్రత్త వహించాలని, ఇటీవల కాలంలో పనిమనిషి రూపంలో ఇళ్లల్లోకి ప్రవేశించి చోరీలు మోసాల సంఘటనలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలు, ఇండ్లల్లో చోరీలు, మోసాలు లాంటి వాటిపై అప్రమత్తం గా ఉంటూ కాలనీలోని ప్రజలు పోలీసులతో సమన్వయం పెంచుకొని, ఎప్పటికప్పుడు సమాచారాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీ లోని మహిళలు, సభ్యులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# పౌరహక్కుల సదస్సుపై అధికారుల నిర్లక్ష్యం

### అవగాహన సదస్సుకు మండల స్థాయి అధికారుల డుమ్మా
### కింది స్థాయి అధికారులను పంపిన వైనం
### నీరుగారుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లక్ష్యం



**రంగారెడ్డి జులై 31 (జనంసాక్షి) :** సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి, వారికి చట్టపరమైన రక్షణ కల్పించడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టంపై అధికారుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. తాజాగా మండల పరిధిలోని ఉప్పరిగూడలో శుక్రవారం నిర్వహించిన పౌర హక్కుల అవగాహన సదస్సుకు మండల స్థాయి ప్రధానాధికారులు డుమ్మా కొట్టారు. ఒక్క శాఖకు సంబంధించిన అధికారులు హాజరు కాకపోవడం పట్ల అట్రాసిటీ నిరోధక చట్టంపై ఉన్న నిర్లక్షం తేటతెల్లమవుతోంది. వారే వివక్ష చూపుతున్నారన్న సర్వత్రా విమర్శలకు వ్యక్తమవుతున్నాయి.

సామాజిక భద్రతను, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కలిగిన తహశీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లేదా సబ్-ఇన్‌స్పెక్టర్ వంటి కీలకమైన మండల స్థాయి అధికారులెవరూ ఈ సదస్సుకు రాలేదు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉండి ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అధికారులే ఈ సదస్సును మొక్కుబడిగా వ్యవహరించడం పట్ల స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానాధికారులు తమ బాధ్యతల నుంచి తప్పుకుంటూ, సమావేశానికి కేవలం కింది స్థాయి సిబ్బందిని లేదా జూనియర్ సహాయకులను మాత్రమే ప్రతినిధులుగా పంపడం చర్చనీయాంశమైంది. గ్రామ సర్పంచ్ శ్రీవేణి హాజరు కాగా, తహసిల్దార్ సునీత రెడ్డి అధ్యక్షతన కొనసాగాల్సిన ఈ సమావేశానికి ఆర్ఐని, ఎంపీడీవో ప్రమీల నాయక్ రాకుండా ఎంపీఓ ఉషా కిరణ్, సోషల్ వెల్ఫేర్ తరపున ఎస్సీ కాలేజీ హాస్టల్ వార్డన్ సువర్ణ హాజరయ్యారు. ఇక పోలీసు శాఖ నుండి ఒక్కరు కూడా హాజరు కాలేదు. ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచేలా అధికారుల తీరు ఉందని, చట్టం అమలుపై వారికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో దీనిబట్టి అర్థమవుతోందని విమర్శలు వస్తున్నాయి.

**నీరుగారుతున్న చట్టం లక్ష్యం**

ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు తక్షణ స్పందన, రక్షణ చర్యలు, బాధితులకు పునరావాసం కల్పించడంలో మండల స్థాయి అధికారుల పాత్ర కీలకం. కానీ, ఇలాంటి ముఖ్యమైన అవగాహన సదస్సులకే వారు గైర్హాజరైతే, క్షేత్రస్థాయిలో అట్రాసిటీ చట్టం అమలు ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అధికారుల ఈ అలసత్వ ధోరణి వల్ల చట్టం యొక్క మూల ఉద్దేశం, లక్ష్యం నీరుగారిపోతున్నాయని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా కఠిన ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల నిలదీత..**

ఎస్సీ సర్టిఫికెట్ జారీలో ఎక్కడ లేని నిబంధనలు విధిస్తూ రెవెన్యూ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని వార్డు సభ్యులు మహేందర్ మండి పడ్డారు. వంద రూపాయల కూడా లేని వృద్ధులను సైతం రూ.500 వెచ్చించి అఫిడవిట్ తేమంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామానికి వచ్చి ఎందుకు విచారణ చేయడం లేదని నిలదీశారు. రెండు నెలలైనా కులం, ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని నిలదీశారు. విద్యార్థులు స్కాలర్షిప్ల కోసం అవసరం ఉన్నందున మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారని మండిపడ్డారు. సవాలక్ష నిబంధనలతో పేదలను ముప్పు తిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. అవగాహన సదస్సుకు మండల సాయి అధికారుల డుమ్మా వ్యవహారంపై త్వరలోనే జిల్లా కలెక్టర్ కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోషి కుమారి, జిపిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గంధంగూడలో అధ్వాన్న రోడ్లు

### మరమ్మతులకు బీఆర్ఎస్ డిమాండ్



**రాజేంద్రనగర్, జూలై31 (జనంసాక్షి) :** గంధంగూడ ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బండ్లగూడ రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్ తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కాలనీని పరిశీలించినట్లు చెప్పారు. 121, 122, 123 డివిజన్లలో కూడా ఇదే పరిస్థితి ఉందని, పలు మార్లు అధికారులకు విన్నవించినా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ పాలనలోనూ ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే ప్యాచ్ వర్క్ చేపట్టి శాశ్వత రోడ్ల నిర్మాణం ప్రారంభించాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఆర్జీఐఏ పీఎస్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**శంషాబాద్, జూలై31(జనంసాక్షి) :** ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న చార్జింగ్ స్టేషన్ వద్ద సుమారు 55--60 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం సాయంత్రం గుర్తించారు. మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. అనారోగ్యం లేదా సరైన ఆహారం లభించకపోవడం వల్ల మృతి చెందినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా గుర్తించగలిగిన వారు ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌ను 8712663319 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.




## బృందావన్ కాలనీలో కుంగిపోయిన రోడ్డు

### పట్టించుకోని అధికారులు

**హయత్‌నగర్, జూలై 27 (జనం సాక్షి) :** హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ రోడ్ నెం-3లో రోజ్ బిర్యానీ పాయింట్ సమీపంలో కుంగిపోయిన మ్యాన్‌హోల్‌కు సుమారు 25 రోజుల క్రితం అధికారులు మరమ్మతులు చేపట్టినా, అనంతరం చేయాల్సిన సీసీ ప్యాచ్ వర్క్‌ను ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ మరమ్మతుల కోసం రోడ్డును కట్ చేసిన ప్రాంతాన్ని అలాగే వదిలేయడంతో వర్షాకాలంలో ఆ భాగం మళ్లీ కుంగిపోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు పేర్కొన్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, వృద్ధులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. వెంటనే స్పందించి సీసీ ప్యాచ్ వర్క్ పూర్తి చేసి ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని బృందావన్ కాలనీ అధ్యక్షుడు, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే కాలనీవాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# నిచ్చెన గుర్తుకు ఓటేసి ఆదర్శ పద్మశాలి టౌన్‌షిప్ నిర్మిద్దాం

## అధ్యక్ష అభ్యర్థి వేముల దీప



**దమ్మాయిగూడ జూలై 31 (జనంసాక్షి ):** శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో నిచ్చెన గుర్తుపై అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న వేముల దీప తన ఎన్నికల హామీలను ప్రకటించారు. “కలిసికట్టుగా ముందుకు వెళ్దాం.. పద్మశాలి టౌన్‌షిప్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం” అనే నినాదంతో ఆమె ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వేముల దీప మాట్లాడుతూ, టౌన్‌షిప్‌లో సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలు, రోడ్లు, వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నివాసితులతో నిరంతరం ఓపెన్ ఫోరంలు నిర్వహించి, ఆదాయం--వ్యయాలను పారదర్శకంగా వెల్లడిస్తామని చెప్పారు. పార్కుల అభివృద్ధి, ప్లాస్టిక్ రహిత టౌన్‌షిప్, ఉచిత వైద్య శిబిరాలు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, గ్రంథాలయం, యువతకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. నిచ్చెన గుర్తుపై అధ్యక్షురాలిగా వేముల దీప, ఉపాధ్యక్షుడిగా భీమగాని సదానందం, ప్రధాన కార్యదర్శిగా బోగ వెంకటేష్, ట్రెజరర్‌గా జయకర్ దర్గా, సంయుక్త కార్యదర్శులుగా నరసింహులు, లక్ష్మయ్య కోలా పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిచ్చెన గుర్తుకు ఓటు వేసి సురక్షితమైన, పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన పద్మశాలి టౌన్‌షిప్ నిర్మాణానికి సహకరించాలని వేముల దీప నివాసితులను కోరారు.



# సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

**షాబాద్ జూలై 31(జనం సాక్షి) ;** అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష మరియు సామర్థ్య శిక్షణ సమావేశ నిర్వహించి. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని అన్నారు. విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్,ఇందిరమ్మ ఇళ్లు తదితర శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, డీఎల్పీవో సతీష్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్,ఆర్డబ్ల్యూఎస్ డీఈ హారిక, ఎంపీవో నాసరయ్య వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు

# నేరేడ్‌మెట్‌లో యువతి అదృశ్యం



**మల్కాజిగిరి జూలై 31(జనంసాక్షి) :** క్యాబ్ చేసుకొని బయటికి వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాని సంఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీబీఎస్ కాలనీకి చెందిన పారుల్ ఖాతున్ (18) అనే యువతి బయటికి వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలి తండ్రి సంతు సర్కార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 30న ఆయన పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి అనుజులా బీబీ కుమార్తెకు భోజనం పెట్టి వంట పనికి వెళ్లింది.అనంతరం ఉదయం 11:30 గంటల సమయంలో యువతి ఒక క్యాబ్ బుక్ చేసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు తండ్రికి సమాచారం అందింది.ఆయన వెంటనే ఇంటికి వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు.బంధువులు, స్నేహితులు మరియు తెలిసిన అన్ని ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సంతు సర్కార్ నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

# కమల నగర్ అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



**కాప్రా , జూలై 31 (జనం సాక్షి ):** కమల నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ముందు ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో మురుగు నీరు నిత్యం రోడ్డుపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు, పాఠశాల విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు ప్రతిరోజూ మురుగు నీటిలోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆలయం ముందు రహదారి పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడుతోంది. మురుగు నీటి కారణంగా తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, ద్విచక్ర వాహనదారులు జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా అయ్యప్ప స్వామి ఆలయానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, కాలనీలోని పార్కుల అభివృద్ధి వంటి పనుల కోసం లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్న అధికారులు ప్రజలకు అత్యవసరమైన డ్రైనేజీ సమస్యను మాత్రం విస్మరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కమల నగర్ అయ్యప్ప స్వామి ఆలయ రోడ్డులో ఉన్న పాత డ్రైనేజీ పైప్‌లైన్‌ను పూర్తిగా తొలగించి, అధిక సామర్థ్యం కలిగిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులకు శాశ్వత ముగింపు పలకాలని కోరుతున్నారు.

# దోమలగూడ స్టీల్ బ్రిడ్జి పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు



**ముషీరాబాద్, జూలై 31 (జనం సాక్షి):** నగరంలోని దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిల్మా ఎక్స్ రోడ్స్ వద్ద ఉన్న స్టీల్ బ్రిడ్జిపై నుంచి గుర్తుతెలియని యువకుడు కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దోమల్ గూడ ఎస్ఎహెచ్ఓ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం తెల్లవారుజామున సుమారు 1:16 గంటల సమయంలో 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు స్టీల్ బ్రిడ్జిపై నుంచి కిందపడ్డాడు. సమాచారం అందుకున్న వెంటనే దోమలగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం 108 అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని పరిశీలించగా, అతడికి తలకు తీవ్ర గాయమైనట్లు గుర్తించారు. వెంటనే క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ప్రతి ఒక్కరు రహదారి భద్రత పాటించాలి

## శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం



**శంషాబాద్, జూలై31(జనంసాక్షి) :** రహదారిపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం అన్నారు. శంషాబాద్‌లోని ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్లో ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను ఉపయోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని సూచించారు. తాము నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలను విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేసి రహదారి భద్రతపై సమాజంలో మరింత అవగాహన కల్పించాలని ఏసీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ,సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు



**హైదరాబాద్, జూలై 31 (జనం సాక్షి):** భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వర్షపు నీరు నిలిచే ప్రధాన ప్రాంతాలను గుర్తించి, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఎంకే ట్రాఫిక్ డీసీపీ II శ్రీ వి. శ్రీనివాసులు, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీ సంపత్‌తో కలిసి ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని ప్రధాన నీటి నిల్వ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. వర్షాల సమయంలో వాహనదారులు ఎదుర్కొనే ఇబ్బందులు, ట్రాఫిక్ రద్దీ, నీరు నిలిచే ప్రాంతాల పరిస్థితులను అధికారులు పరిశీలించారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా ట్రాఫిక్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. రహదారులపై నీరు నిలిచిన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి : బీజేపీ

### సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయంలో సంతకాల సేకరణ

**సికింద్రాబాద్(జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఫీజు బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తార్నాక విజయపురి కాలనీలోని సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ నాయకులు, సమాజ సేవకుడు శ్రీరామ్ వెంకటేష్ హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సరియైన సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్, బకాయిలు అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, బకాయిలను విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు విద్యార్థులకు అండగా బిజెపి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ గౌడ్, శారద మల్లేష్, మల్లికంటి వీరన్న, బీజేవైఎం నాయకులు ఆదర్శ్, విజయ్, శివాజీ, మహిళా మోర్చా నాయకురాలు అనుష, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మల్లన్న తండాలో విద్యుత్ మీటర్లను పంపిణి చేసిన సిఎండీ పాటిల్



**శామీర్ పేట, జూలై 31(జనం సాక్షి ) :** సేవాలాల్ మల్లన్న గిరిజన (తాండ) కాలనీలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు విద్యుత్ మీటర్లను అందజేశామని టిజిఎస్ పిడిసిఎల్ సి ఎండి (చైర్మన్ అండ్ మెనేజింగ్ డైరెక్టర్ )జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం శామీర్ పేట డివిజన్ దేవరయాంజాల్ లోని సేవాలాల్ మల్లన్న కాలనీలో నివాసముంటున్న గిరిజన కుటుంబాలకు ఎస్టీ కమిషన్ ఆదేశాలతో స్థానికంగా నివసిస్తున్న వారికి 40 విద్యుత్ కనెక్షన్ మీటర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ తాండ మల్లన్న కాలనీ అసోసియేషన్ ప్రసిడెంట్ పూల్సింగ్ గతంలో కాలనీలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకుకొత్త విద్యుత్ మీటర్లు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నారని చెప్పారు. ఇట్టి విషయంపై ఎస్టీ కమిషన్ స్థానికంగా నివాసం ఉంటున్న వారికి గుర్తించి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలతో నూతనంగా విద్యుత్ మీటర్లు మంజూరు చేశామని తెలిపారు . ఈ కార్యక్రమంలో మేడ్చల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఆపరేషన్ జ్ఞానేశ్వర్, డివిజనల్ ఇంజనీర్ జాన్ పోతరాజు, శామీర్ పేట సబ్ డివిజన్ ఏడిఈ శ్రీనివాస్, శామీర్ పేట సెక్షన్ ఏ ఈ విజయకుమార్, గిరిజన కాలనీ అధ్యక్షుడు పూల్సింగ్ నాయక్, గిరిజనులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దేశాల దివ్యశ్రీకి సన్మానం



**శంషాబాద్,జూలై 31(జనంసాక్షి) :** టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ విభాగం రాష్ట్ర కన్వీనర్గా నియమితులైన దేశాల దివ్యశ్రీని శుక్రవారం శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకుడు రాచమల్ల సురేష్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి నగర్‌లోని దివ్యశ్రీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆమె తండ్రి దేశాల భూపాల్, విశ్వనాథం, చింటు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృ అభివృద్దే ధ్యేయం

### ఉప్పరిగూడ సర్పంచ్ శ్రీ వేణి

### మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల దుస్తుల తయారీ కేంద్రం ప్రారంభం

**రంగారెడ్డి, జులై 31 (జనంసాక్షి)**

గ్రామీణ మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఉప్పరిగూడ సర్పంచ్ శ్రీ వేణి సూచించారు. ఉప్పరిగూడ గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల దుస్తులు (యూనిఫామ్స్) కుట్టే కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, ఉపాధి రంగాల్లో రాణించాలని సూచించారు. అందుకు గ్రామ పంచాయతీ తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన డ్రస్సులను ఇకపై బయట ప్రాంతాల నుండి కొనుగోలు చేయాల్సిన పనిలేకుండా, స్థానికంగా ఉన్న మన సంఘాల మహిళల చేతనే నాణ్యమైన కుట్టుపనితో ఈ దుస్తులు తయారు చేయించడం అభినందనీయమన్నారు. మహిళలకు ఉపాధి లభించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం సాంబశివుడు, సీసీ సత్తయ్య, విలేజ్ బుక్ కీపర్ అనురాధ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నర్సుడి మహేందర్, కొంగరి రవితేజ, పాఠశాల ఉపాధ్యాయులు పాండు రంగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వాతి, పాల్గొన్నారు.



## పోషమ్మ దేవతకు ఆషాఢ బోనాలు



**కొడంగల్, జూలై 31 (జనం సాక్షి):** కొడంగల్ మండలం అంగడి రాయిచూరు గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా గ్రామదేవత పోషమ్మ అమ్మవారి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని డప్పులు, వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా వైభవంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.అనంతరం భక్తులు పోషమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, సమయానికి వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.



## పద్మాశాలి టౌన్షిప్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : దీపా

### ఇంటింటి ప్రచారం చేస్తున్న నిచ్చెన ప్యానెల్ అభ్యర్థులు

**కాప్రా,జూలై 31 (జనం సాక్షి) :** భావన ఋషి పద్మాశాలి టౌన్షిప్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాలనీవాసులు తమ అమూల్యమైన ఓటు వేసి తమను గెలిపించాలని కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో నిచ్చెన ప్యానెల్ తో పోటీ చేస్తున్న అధ్యక్షురాలు అభ్యర్థి శ్రీమతి యేముల దీపా కోరారు. ఆగస్టు 02వ తేది ఆదివారం భవన ఋషి పద్మాశాలి టౌన్షిప్ కాలనీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాలనీ ఎన్నికల్లో నిచ్చెన గుర్తుతో దీపా ప్యానెల్ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గురువారం ప్యానెల్ అభ్యర్థులు, కాలనీవాసులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షురాలు అభ్యర్థి దీపా మాట్లాడుతూ కాలనీలో గత కొంత కాలంగా మంచి నీటి సమస్యతో బాధపడుతున్నమని, అలాగే డంపింగ్ యార్డ్, కాలనీ భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు పిల్లలకు ఆటస్థలం, పార్కుల అభివృద్ధి వంటి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీవాసులు ఇబ్బంది పడకుండ అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తమ నిచ్చెన గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్ష అభ్యర్థి బి.సదానందం, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్, సంయుక్త కార్యదర్శి కోల నర్సింహులులక్ష్మయ్య, కోషాధికారి జయదుర్గా, కార్యవర్గ సభ్యులుగా జె. విజయ్ కుమార్, జె. సందీప్, ఎం. సుభాష్, ఎస్.రమాదేవి ప్రచారంలో పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

### పెల్చాల గ్రామ సర్పంచ్ కే శ్రీనివాస్

**మెమిన్‌పేట్, జూలై 31(జనంసాక్షి) :** మారుమూల గ్రామాల్లో ప్రజలు దంత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్ చాల, గ్రామ సర్పంచ్ కావలి, శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వెల్చాల్ గ్రామంలో సాయి డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 60 మంది రోగులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దంత చికిత్సల కోసం సాయి డెంటల్ ఆసుపత్రికి రావలసిన వారిని పంపించా మన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, జిపిఏ, వెంకటపతి, గ్రామస్తులు, దామోదర్ సాగర్, సంజీవరెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయి, డాక్టర్ లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి : షేక్ చాంద్ పాషా



**శేరిలింగంపల్లి, జూలై 31 (జనంసాక్షి) :** స్పెషల్ ఎంటెన్సీ రివిజన్(సర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతోపాటు సజావుగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధి అంజయ్య నగర్ వార్డులో స్థానిక బూత్ లెవెల్ అధికారులు, బిఎల్ఎ లతో కలిసి వారు సర్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎన్యూమరేషన్ ఫోరం పంపిణీ,

ఓటరు మార్పులు, చేర్పులు మరియు తొలగింపుల ప్రక్రియను సమీక్షించి కార్యక్రమం సజావుగా నిర్వహించేలా అవసరమైన సూచనలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎన్నిమరేషన్ ఫారాల నమోదును ఈనెల 3వ తేదీనుండి 10వ తేదీ వరకు పెంచడం జరిగిందని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు సార్ ప్రక్రియ ద్వారా ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని చాంద్ పాషా సూచించారు.

# ముంపు ప్రాంతాల సమస్యలను తీర్చాలని అధికారులకు వినతి



**జనంసాక్షి /నాచారం:** ముంపు ప్రాంతాలను పరిశీలించి అక్కడ సమస్యలను తీర్చాలని అధికారులను కోరినట్టు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాహిత్యం శేఖర్ తెలిపారు. హెచ్ఎంటి డివిజన్లోని రాఘవేంద్ర నగర్ లోని జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద గత కొన్ని సంవత్సరాల నుంచి ముంపు ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు తెలియజేసినట్టు టిఆర్ఎస్ పార్టీ నాయకులు సైదులు శేఖర్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఉన్నటువంటి సమస్యలను తీర్చాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినట్టు అన్నారు. శుక్రవారం రోజున అధికారులు ఈ రమేష్ డి సాయి పృథ్వి ఏఈ సూరజ్ లతో కలిసి రాఘవేంద్ర నగర్ లో పర్యటించినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధికారులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వర్షం పడితే చాలు వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి కనీసం నడవలేని పరిస్థితుల వల్ల పాఠశాలకు వెళ్లవలసిన విద్యార్థుల సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు సూచించినట్టు తెలిపారు. సమస్యల గురించి తెలుసుకున్న అధికారులు అక్కడే ఉండి పరిశీలించగా వర్షపు నీరు మురుగునీరు ఏకమై తీవ్ర దుర్గంధంతో రోడ్డుపై నిలిచిపోవడం చూసి అధికారులు సైతం నివ్వరపోయినట్టు టిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్ తెలిపారు. ఇట్టి సమస్య శాంతి గార్డెన్స్ వెనకవైపు ఉన్నా బాక్స్ డ్రై ను పూర్తిగా కూడిక కుప్పగా మారడంతో అట్టి నీరు ప్రవాహం నిలిచిపోయి జాన్సన్ గ్రామర్ స్కూల్ వైపుగా సమస్య విపరీతమైపోయినట్టుగా అక్కడ అధికారులకు అర్థమైందని వారు తెలిపారు.సమస్యలను తీర్చుటకు అధికారులు సానుకూలంగా స్పందించి ఇప్పటికే 35 లక్షల రూపాయల ప్రతిపాదనలు జోనల్ కమిషనర్ కు తెలియజేసినట్టు కచ్చితంగా అట్టి నిధులను మంజూరు చేయించి పనులను చేయిస్తామని సానుకూలంగా తెలియజేసినట్టు సాయిజన్ శేఖర్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యంరెడ్డి రాంబాబు దేవులపల్లి యాదగిరి లక్ష్మీనారాయణ చంద్రశేఖర్ మరియు కాలనీవాసులు యువత పాల్గొన్నారు.

# చేవెళ్ల మండల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం : ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

## ప్రజాప్రతినిధులతో సమన్వయంగా అధికారులు పనిచేయాలి : ఎంపీడీవో బన్సీలాల్




**చేవెళ్ల, జూలై 31 (జనంసాక్షి)** చేవెళ్ల మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. శుక్రవారం ఎంపీడీవో బన్సీలాల్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ ప్రజాప్రతినిధుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గ్రామాల వారీగా సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను నమోదు చేసుకున్నామని, వాటిని ప్రాధాన్యత ఆధారంగా దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో సర్పంచులు మండలంలోని గ్రామీణ రహదారుల దుస్థితిని ప్రధానంగా ప్రస్తావించారు. వర్షాలతో రోడ్లు గుంతలమయంగా మారి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు భవనాలు శాఖ, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కొత్త రోడ్లు వేయకపోయినా కనీసం గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. అలాగే అనేక గ్రామాల్లో విద్యుత్ వైర్లు ఇండ్లపై నుంచి ప్రమాదకరంగా వేలాడుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ రాజేందర్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత, విధుల నిర్వహణ సరిగా లేదని గుండాల సర్పంచ్ నక్క బుచ్చి రెడ్డి, ఈర్లపల్లి సర్పంచ్ లావణ్య, నాన్చెరు సర్పంచ్ ఆశోక్ పేర్కొన్నారు. అవసరమైన చోట్ల వెంటనే సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా లేదని, రక్తపరీక్షల ఫలితాలను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మహిళా సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో బన్సీలాల్ వైద్య సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. కుమ్మెర గ్రామంలో ఆరోగ్య కార్యకర్త లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ అనురాధ వివరించారు. సమావేశంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య మాట్లాడుతూ.. రేషన్ కార్డు లబ్ధిదారులందరూ తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని, ఎస్ఐఆర్ ఫారాలను నింపి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. హౌసింగ్ అధికారులు అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మండల విద్యాధికారి పురందాస్, బిక్షపతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకతతో పూర్తి చేయాలి

**నిజాంపేట్ జూలై 31 జనం సాక్షి :** సిఎంసి 56 కొంపల్లిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను రెండు కేంద్రాలలో శుక్రవారం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా బి ఎల్ ఓలతో మాట్లాడి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, అలాగే ఎన్నికల ఏజెంట్లు సహకరిస్తున్నారా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిజ నిర్ధారణలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఆర్ ఓ డ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ , ఏఈఆర్ ఓ డ డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# సీఐ, ఎస్సైలను సన్మానించిన బీసీ సంఘం అధ్యక్షుడు బండ మీది వెంకటేశం



**శంకర్ పల్లి, జూలై 31(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా, శంకర్పల్లి మండలంలోని మోకిలా గ్రామ నివాసి చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటేశం శుక్రవారం చేవెళ్ల పట్టణ సీ.ఐ నరేందర్ రెడ్డి,ఎస్సై కోటేశ్వరరావు లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం శాలువాతో సత్కరించారు.స్వామి వివేకానందుడి స్ఫూర్తిదాయక ఫోటో ఫ్రేమ్ను జ్ఞాపకగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన అధికారులకు నియోజకవర్గంలో శాంతిభద్రతలు కాపాడేందుకు బీసీ సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# సైబర్ నేరాల పట్ల అవగాహన చాలా అవసరమున్న నాచారం ఇన్‌స్పెక్టర్



**నాచారం (జనంసాక్షి) :** మల్లాపూర్ లోని సూర్య నగర్ లో స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేస్తున్న పిల్లలని కలిసి సైబర్ నేరాల పట్ల మరియు సోషల్ మీడియా వల్ల మంచి చెడులను గురించి విద్యార్థులతో నాచారం ఇన్స్పెక్టర్ ధనుంజయ్ గౌడ్ చర్చించారు. విద్యార్థుల తో ఇన్స్పెక్టర్ తో పాటు ఎస్ఐ మైబెల్లి రజిని విద్యార్థి నాయకుడు సత్యప్రసాద్ సైతం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి నాచారం ఇన్స్పెక్టర్ ధనుంజయ గౌడ్ మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే యువత సరైన మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్న గురువుల మాట వింటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించి తమ ఇంటికే కాదు దేశానికి సైతం పేరు తెచ్చే విధంగా ప్రతి విద్యార్థి కష్టంతో కాదు ఇష్టంతో ముందుకు సాగాలి అని వారి ఉద్దేశించి మాట్లాడినారు. అంతేకాకుండా తమను తాము కాపాడుకునేటువంటి దిశగా సోషల్ మీడియాను ఎంతవరకు వాడాలో వాటి పట్ల అవగాహనను పెంచుకోవాలని తెలిపారు. సెల్ ఫోన్ వలన మంచి ఎంత ఉందో చెడు కూడా అంతే ఉంటుందని కాబట్టి సైబర్ నేరాల పట్ల అవగాహనను సైతం పెంచుకొని తమ వ్యక్తిగత జీవితాన్ని తమకు తామే కాపాడుకునేటువంటి విధంగా సమాజంలో నడుచుకోవాలని వారికి సూచించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా సమాజంలో తమకు గుర్తింపు వచ్చే విధంగా తమ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలని వారితో నాచారం ఇన్స్పెక్టర్ ధనుంజయ్ గౌడ్ ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్లోని సూర్య నగర్ కాలనీ

# ఎస్ఎల్జీ సర్కిల్-కౌశల్య కాలనీ రోడ్డు నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్యం

**నిజాంపేట్ జూలై 31 జనం సాక్షి :** నిజాంపేట్–బాచుపల్లి ప్రధాన రహదారి నుంచి కౌశల్య కాలనీకి వెళ్లే మార్గంలో కమాన్ ఏర్పాటు కోసం నిర్మిస్తున్న వ్యర్థాల తొలగించక పోవడంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంబంధిత అధికారులు మాత్రం బాధ్యులైన వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదని నిజాంపేట్ బిజెపి అధ్యక్షుడు ఎన్ ప్రసాద్ రాజు తెలిపారు, ఈ మేరకు శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయంలో బిజెపి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఎల్జీ సర్కిల్ నుంచి గుల్మొహార్ గేటెడ్ కమ్యూనిటీ వరకు రోడ్డు పనులు తీవ్ర జాప్యంతో పూర్తిచేసినా, ఎస్ఎల్జీ హాస్పిటల్ ముందు సుమారు 40 అడుగుల రోడ్డు పనులను ఎందుకు వదిలేశారని కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా, అధికారుల పర్యవేక్షణ లోపమా, అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిత్యం ఇబ్బందులు, ప్రమాదాలు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడశీ శోచనీయమని ఇప్పటికైనా వెంటనే ఆర్చి శిథిలాలను వెంటనే తొలగించాలి. ఎస్ఎల్జీ



హాస్పిటల్ ముందు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని,పనుల జాప్యానికి, పెండింగ్ పనులకు బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించకపోతే ఈ విషయాన్ని జోనల్ కమిషనర్, కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రజల తరఫున తదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని. ప్రజా సమస్యలపై బీజేపీ ఎల్లవేళలా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నందివనపర్తిలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

- మాధవంజి ఆసుపత్రి ఫౌండర్ ఆధ్వర్యంలో నిర్వహణ
- గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ

**యాచారం, జులై 31 (జనం సాక్షి) :** యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో శుక్రవారం శ్రీ మాధవంజి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫౌండర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి నెదర్లాండ్ దేశానికి చెందిన ప్రతినిధి బృందం విశిష్ట అతిథులుగా హాజరై, గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ విదేశీ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికి, శిబిరంలో చురుగ్గా పాల్గొన్నారు.కార్యక్రమంలో శ్రీ మాధవంజి ఆసుపత్రి ఫౌండర్ మాట్లాడుతూ, నందివనపర్తి గ్రామ సమగ్ర అభివృద్ధికి తమ వంతుగా అన్ని విధాల సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ఉచిత శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, వివిధ రకాల ఉచిత వైద్య సేవలను, పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,పాల్గొన్నారు.

# హాజీపూర్ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జి మల్లేశం మాదిగ

**యాలాల జులై 31(జనంసాక్షి) :** యాలాల్ మండలం హాజీపూర్ గ్రామం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జి మల్లేశం మాదిగకు మండల ఇన్చార్జి మెట్లీ సూర్యప్రకాష్ మాదిగ నియామక పత్రం అందజేశారు.శుక్రవారం యాలాల్ మండలం హాజీపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ యాలాల్ మండల ఇంచార్జ్ మెట్లీ సూర్య ప్రకాష్ మాదిగ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని నియమించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జి మల్లేశం మాదిగ, అధికార ప్రతినిధిగా జే రమేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా జే శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు నర్సింలు మాదిగ, ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ , కార్యదర్శులుగా అనంతయ్య, కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఆనంద్, శ్రీనివాస్, రమేష్, లాలప్ప, అనిల్ లను నియమించడం జరిగింది.అనంతరం మండల ఇన్చార్జి మెట్లీ సూర్యప్రకాష్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు పోరాడి తమ హక్కులను సాధించుకున్నారని వాటిని నేటి యువత విద్య, ఉద్యోగాల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో మాదిగలు ఆర్థికంగా రాజకీయంగా ఉన్నత స్థాయిలోకి రావాలని అన్నారు. అందుకు మాదిగలు సంఘటితం కావాలని ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రుక్కమ్మకు ఘన నివాళి

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

**షాబాద్, జూలై 31 (జనం సాక్షి);** తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి రుక్కమ్మ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శనివారం షాబాద్ లోని వారి నివాసంలో దివంగత రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల

## చేయాలని విద్యార్థుల సంతకాల సేకరణ

**హయత్‌నగర్, జూలై 31 (జనం సాక్షి) :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టిన “ఫీజుల బకాయి – బీజేపీ లడాయి” కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అర్బన్ నాయకులు పారంద సాయి, జయతేజ ఆధ్వర్యంలో శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్, హయత్‌నగర్ పరిధిలోని పలు ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, బీటెక్ కళాశాలల్లో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోలాం యశ్పాల్ గౌడ్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా



ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు నక్క రాజేష్ గౌడ్, ప్రమోద్ రెడ్డి, బీజేవైఎం హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ నాయకులు ఎర్ర ప్రేమ, పాండాల అభిలాష్ గౌడ్, విష్ణుచారి, బుల్లెట్ సాయి యాదవ్, చరణ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మన చంద్ర ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు

**మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్. ఏ చంద్రప్రియ.**

**మోమిన్ పేట, జూలై 31(జనంసాక్షి) :** మన చంద్ర ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో నిరుపేదలైన మహిళలకు నిరుపేదలకు, గర్భిణీ స్త్రీ, విద్యార్థులకు, ఉచిత వైద్య శిబిరాలు, వంటి సేవా కార్యక్రమాలకు నిర్వహిస్తామని, మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి డాక్టర్ ఎం, చంద్రశేఖర్ కూతురు డాక్టర్ చంద్రప్రియ అన్నారు. శుక్రవారం మోరంగ్ పల్లి గ్రామంలో అంబేద్కర్ పూలమాల వేసి, అనంతరం పులిగారి వెంకటయ్య ఆధ్వర్యంలో యువకులు గ్రామ పెద్దలు, చంద్రప్రియను, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలకు మహిళలకు, రోగులకు, గర్భిణీలకు, విద్యార్థులకు అవసరమైనటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని, చెప్పారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ కూతురు ను, నియోజకవర్గ పరిధిలోని గ్రామ గ్రామాన పర్యటించి ప్రజల యొక్క తెలుసుకొని మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం సేవ ఫౌండేషన్ సభ్యులు, బుధరపు బుచ్చిరెడ్డి, పులిగారి వెంకటయ్య, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# ఒకే దేశం ఒకటే ఓటు

**బిజెపి రాష్ట్ర నాయకులు శరత్ కుమార్ రెడ్డి**



**పరిగి జులై 31 (జనం సాక్షి) :** ఒకే దేశం ఒకే ఓటు కార్యక్రమంలో భాగంగా మహమ్మదాబాద్ శుక్రవారం నాడు బీజేపీ రాష్ట్ర నాయకుడు శరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మండల ప్రవాస్ యోజన లో భాగంగా పరిగి నియోజకవర్గం లోని మహమ్మదాబాద్ మండలం లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి పోలింగ్ బూత్ తిరుగుతూ అక్కడ ఉన్నా బి ఎల్ ఎ 2 తో కలిసి ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని హైదరాబాద్ లో ఉన్నా.. మహారాష్ట్ర లో ఉన్నా మొదటగా మీ గ్రామం లో బి ఎల్ ఓ కు సహకరించి ఓటు హక్కు పొందాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కుర్వ కృష్ణ. జిల్లా నాయకుడు ప్రభూ నాయక్ మండల ప్రధాన కార్యదర్శి బోయిని కాశి నాథ్.పవన్ కుమార్. ఈశ్వర్. హరీష్ నాయక్ వార్డ్ మెంబర్. బూత్ అధ్యక్షులు. రాజు. ఆంజనేయులు.అనిల్ మరియూ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు

# మున్సిపల్ అధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలి

**జిల్లా నాయకుడు బీఆర్ఎస్ మక్తల సురేందర్ గౌడ్ డిమాండ్**



**మొయినాబాద్ జూలై 31(జనం సాక్షి):** మొయినాబాద్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్య క్ష పదవిని ఈసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి కేటాయించాలని నేను 2013నుండి బి ఆర్ ఎస్ పార్టీ లో మొయినాబాద్ సీనియర్ నాయక ఉంటున్నాను మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాను కనుక అధిష్టానం నన్ను మనస్ఫూర్తిగా అధిష్టానాన్ని కోరుకుంటున్నాను. సీనియర్ నాయకుడు మక్తల సురేందర్ గౌడ్ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పార్టీ అధ్యక్ష పదవిని గతంలో మూడుసార్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అప్ప గించారని వచ్చే ఎన్నికల్లో బీసీలకే ఇవ్వాలని కోరారు తాను కూడా మున్సిపల్ అధ్యక్ష పదవి రేసులో ఉన్నానని, పార్టీని నమ్ముకుని సంవత్సరాలుగా పనిచేస్తున్నానని అధిష్టానం గుర్తించి ఇవ్వాలని కోరారు

# నిరుపయోగంగా ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్

**నవాబ్ పేట్ జూలై 31( జనం సాక్షి)** నవాబ్‌పేట్ మండల కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ లోపంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు స్థానిక ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ఉపయోగం లేకుండా .ఈ దుకాణాలను నామమాత్రపు అద్దెకు ఇచ్చి ప్రోత్సహించాలని అధికారులు సంకల్పించారు.అయితే కొన్ని ఏళ్లుగా నిర్వహణ లేకపోవడం వల్ల భవనం క్రమంగా శిథిలావస్థకు చేరింది,దీనిని కనీసం ఎలా ఉందని సంబంధిత అధికారులు పరిశీలన పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానిక మండల ప్రజలు విమర్శలు చేస్తున్నారు.సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టి షాపింగ్ కాంప్లెక్స్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆస్తి కూడా పరిరక్షించబడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.


# జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సీఐటీయూ




**హయత్‌నగర్, జూలై 31 (జనం సాక్షి) :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని టీసీఐ, ఐలా సంస్థల కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ, కార్మికులు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ ఉద్యోగ భద్రతను దెబ్బతీసే విధానాలను అమలు చేస్తోందని, ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా కార్మికులను తొలగించే పరిస్థితులు కల్పిస్తోందని ఆరోపించారు.
నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులు హరించబడతాయని, కనీస వేతనాల అమలుపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన అన్నారు. విదేశీ వస్తువుల దిగుమతులను విచ్చలవిడిగా ప్రోత్సహించడం వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే జైల్ భరో కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. రామస్వామి, కార్మికులు సుభద్ర, సుగుణ, వెంకటమ్మ, అరవింద్, ధనాజీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూములను స్వాధీనం చేసుకోవద్దు: బీజేపీ

**హయత్‌నగర్ :** మండలంలోని హన్మగల్-హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలోని సర్వే నంబర్ 255/1 భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో బీజేపీ నాయకులు శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. రైతులు, ప్లాట్ల యజమానులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ సర్వే నంబర్ 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉందని, ప్రజా అవసరాల కోసం కొంత భూమిని వినియోగించినప్పటికీ మిగిలిన భూమిలో రైతులు దశాబ్దాలుగా సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కుటుంబ అవసరాల కోసం కొందరు రైతులు భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించగా, ప్రస్తుతం వందలాది కుటుంబాలు వాటిపై ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. 1971లో అప్పటి ప్రభుత్వం అర్హులైన రైతులకు పట్టా పుస్తకాలు జారీ చేసిందని, వాటిని నమ్ముకొని రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేశారని గుర్తు చేశారు. అనంతరం భూములను కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి కుటుంబాల హక్కులను ఇప్పుడు ప్రభుత్వం ప్రశ్నించడం అన్యాయమని ఆరోపించారు. గతంలో ఇచ్చిన హక్కులను తిరస్కరించి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం ప్రజల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు.
పేదల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు పేదల భూములనే స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. రైతులు, ప్లాట్ల యజమానులకు పూర్తి భరోసా కల్పించి భూస్వాధీనం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు తడకమళ్ల విజయ్‌కుమార్, గంగాని రాము, రైతులు గంగాని నగేష్, బోడ శ్రీరాములు, కాటేపాక స్కైలాబ్, కాటేపాక మల్లేష్, జెనికి శంకరయ్య, ఇతర రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# నిమ్హాన్స్ ఆహ్వానంతో జాతీయ మనోవిజ్ఞాన

## సదస్సులో పాల్గొన్న డా. ఎన్. వెంకటేశ్వర్లు

**హయత్ నగర్, జూలై 31(జనం సాక్షి) :** హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ సైకాలజిస్టు, తెలంగాణ సైకాలజిస్టుల సంఘం (టీపీఏ) ఉపాధ్యక్షుడు డా. ఎన్. వెంకటేశ్వర్లు నిమ్హాన్స్ (బెంగళూరు) అధికారిక ఆహ్వానంతో ఆహ్వానిత ప్రతినిధిగా తొలి భారతీయ మనోవిజ్ఞాన దినోత్సవం, జాతీయ సదస్సులో పాల్గొన్నారు. జూలై 29 నుంచి 31 వరకు నిమ్హాన్స్ క్లినికల్ సైకాలజీ విభాగంలోని విప్రా విభాగం, నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ సైకాలజీ ఫర్ మెంటల్ హెల్త్ అండ్ వెల్-బీయింగ్" అంశంపై ఈ సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు, మనోవైద్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, మానసిక ఆరోగ్య నిపుణులు పాల్గొని భారతీయ మనోవిజ్ఞాన శాస్త్రం ప్రాధాన్యం, ఆధునిక మానసిక ఆరోగ్య సేవల్లో దాని పాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా డా. వెంకటేశ్వర్లుకు నిమ్హాన్స్ డైరెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. నిమ్హాన్స్ వంటి దేశ అత్యున్నత మానసిక ఆరోగ్య సంస్థ నుంచి అధికారిక ఆహ్వానం అందుకోవడం తన విద్యా, పరిశోధన, మనోవిజ్ఞాన సేవలకు లభించిన విశిష్ట గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. సదస్సులో పొందిన విజ్ఞానాన్ని కౌన్సెలింగ్, బోధన, పరిశోధన, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో వినియోగించి సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని డా. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# ఉప్పల్‌కు ఇక ట్రాఫిక్ తిప్పలు తీరనున్నాయా?

**ఉప్పల్, జూలై 31 (జనంసాక్షి):** హైదరాబాద్ తూర్పు ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. నగరంలోని అత్యంత రద్దీ కూడళ్లలో ఒకటైన ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోంది. ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద కీలక పిల్లర్ నిర్మాణ పనులు పూర్తయినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుండటంతో, రింగ్‌రోడ్డును ఎప్పుడు పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలకు అందుబాటులోకి తీసుకువస్తారనే అంశంపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. హైదరాబాద్ నుంచి వరంగల్, యాదాద్రి, భువనగిరి, ఘట్‌కేసర్, నారపల్లి, పోచారం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ఉప్పల్ ప్రధాన మార్గంగా ఉండటంతో ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ జంక్షన్ మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పల్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మున్సిపల్ కార్యాలయం, విద్యుత్ శాఖ, పోస్టాఫీస్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ఈ ప్రాంతంలో రాకపోకలు మరింత అధికంగా ఉంటాయి. నిర్మాణ పనుల కారణంగా రోడ్ల వెడల్పు తగ్గడం, ట్రాఫిక్ మళ్లింపులు, దుమ్ము, శబ్ద కాలుష్యం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.
అయితే నిర్మాణ పనులు వేగంగా సాగుతుండటంతో రింగ్‌రోడ్డును త్వరలోనే తెరుస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం స్థానికులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పూర్తయిన తర్వాత ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు సిగ్నళ్ల వద్ద నిరీక్షణ సమయం తగ్గడం, ఇంధన వినియోగం, కాలుష్యం తగ్గడం, ప్రయాణ సమయం ఆదా కావడం వంటి ప్రయోజనాలు కలుగనున్నాయి. తూర్పు హైదరాబాద్ రవాణా వ్యవస్థకు ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలతో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఉప్పల్ ప్రజలు, వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు పనులు త్వరగా పూర్తి చేసి రింగ్‌రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# బీఆర్ఎస్ మండల అధ్యక్ష వదవి బీసీలకు ఇవ్వాలి

## మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు మోర శ్రీనివాస్



**మొయినాబాద జనం సాక్షి జూలై 31:** మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని బడుగు బలహీన వర్గాల బీసీ వర్గానికి కేటాయించాలని మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు మోర శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డివల్లిలో ఈ సందర్భంగా మాట్లాడుతూ మొయినాబాద్ మండలంలో గత మూడు వరియాలాలుగా రెడ్డి సామాజిక వర్గానికి బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్ష వదవి కొనసాగుతుందన్నారు. ఈ వర్యాయం ప్రస్తుతం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష వదవిని బీసీలకే ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నామని తెలిపారు. గతంలో సంవత్సరన్నర కిందట మొయినాబాద్ మండలం, మున్సిపాలిటీ ఏర్పడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిని బీసీలకు ఇచ్చేందుకు అదిష్టానం కృషి చేయాలని కోరారు. బీసీల నుంచి తాను మండల అధ్యక్షుడిగా ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆశీర్వాదంతో బీసీలకే ఆ వదవిని ఇప్పించాలని కోరారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**మహేశ్వరం మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచుల విజ్ఞప్తి**

**బెల్ట్‌షాపులు, గంజాయి నియంత్రణపై అధికారులకు సూచనలు**

**గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, మౌలిక వసతులపై చర్చ**



**మహేశ్వరం, జూలై 31 (జనంసాక్షి):**
మహేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచులు అధికారులను కోరారు. శుక్రవారం మండల కార్యాలయంలో ప్రత్యేక అధికారి సుభాషిణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. నాగారం, కోళ్లపడకల్, ఎన్‌డీ తండా, గట్టుపల్లి, ఆకాన్ పల్లి తదితర గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్యలను సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.
కోళ్లపడకల్ గ్రామంలో కిరాణా దుకాణాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, బోనాల సందర్భంగా బెల్ట్‌షాపులను మూసివేయాలని సర్పంచ్ చేపంగి ప్రవీణ్ కోరారు. దీనిపై ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శ్రీనివాస్ స్పందిస్తూ అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. నాగారం గ్రామంలో యువత గంజాయికి అలవాటు పడుతున్నారని సర్పంచ్ లింగం ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సీఐ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సర్పంచులకు సూచించారు.
గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా సమస్యలపై కూడా సర్పంచులు ప్రస్తావించగా, విద్యుత్ శాఖ ఏఈ చక్రపాణి స్పందిస్తూ అంతరాయాలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.
జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎంపీవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సర్పంచులు ప్రస్తావించిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, ఎంపీడీవో శారదమ్మ, డీఎల్పీవో సామిరెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు, ఎంఈవో కాస్న నాయక్, సర్పంచులు మునగపాటి నవీన్, రాజు నాయక్, గొల్లూరి రాజు, తుమ్మట్టి అండాలు, పద్మ, బక్కని లక్ష్మమ్మ, దేవేందర్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.